# ఇట్ ఆల్ ముచ్చట్స్

ఆవకాయ దగ్గరి నుంచి ఆటంబాబు వరకు ఆల్ ముచ్చట్స్‌తో అలరిస్తూ, వినోదాలవిందులు వడ్డిస్తూ, బోరు రచనల బారి నుంచి మము బ్రోచే 'సీతమ్మ' కలం ఘుఘులలు.

దీపావళి వొస్తుందంటేనే చాలు-పిల్ల వెధవలకి, ఆడాళ్ళకు కోరికలే గుర్రాలైతే, మగాళ్ళకు బి.పి. రెయిజైపోతుంది. కొత్తల్లుడు కొమ్మెక్కి కూర్చుని సవాలక్ష కోరికలు కోరుకుంటాడు. అవి తీర్చకపోతే గంజి పెట్టిన పోలీసు ఖాకీ నిక్కరులా నీలుక్కుని కూర్చుంటాడు. మావగారు చేసిన అప్పులు 'ఎందెందు వెదకిజూచిన అందందే' వుంటాయి. నూతన వధువుకు సిగ్గులతో బుగ్గలుఎర్రబడతాయి. ఒక్కొక్కరిది ఒక్కో అవస్థ.

మా చిన్నప్పుడు పండగంటే ఇంటికి నిజమైన కళ వచ్చేది. తలకు నూనె అంటుకోవడం, శీకాయ పొడితో తల రుద్దుకోవడం ఇదంతా ఓ తతంగం. ఇప్పుడు అంత ఓపిక ఎవరికుంది? జగమంతా షాంపూ౦ మయం. అత్తారింటికొచ్చిన అల్లుడికి బూరెలు, పాయసం, గారెలు చూస్తే చాలు కడుపు నిండేది. పంచెల చాపే పదివేలనుకునేవాడు.ఇప్పటి మోడ్రన్ అల్లుళ్ళకి పంచెల చాపిస్తే వడియాలు పెట్టుకోమని మొహాన విసురుతారు.

సినిమాల్లో చూపించే దీపావళిలో అప్పులు, చకరిదప్పులు వుండవ్. సొమ్ము నిర్మాతదైతే సోకు హీరో హీరోయిన్లది. పిల్ల వెధవలకు కాకరొత్తులు, చిచ్చుబుడ్లు కొనిచ్చేసరికి మన బడ్జెట్ బరువౌతుంది. ఆ సత్యభామ నరకాసుడితో యుద్ధం చేస్తే ఈ కాలం భామలు పెరుగుతున్న ధరలతో ఫైట్ చేస్తున్నారు. నరకాసురుడు నేలవాలాడు కానీ ధరలు మాత్రం 'దిగిరాము దిగిరాము దివి నుంచి భువికి' అంటున్నాయి. అఖిలాంధ్ర ఆడపడుచుల సంఘం అన్నగారికి విజ్ఞప్తి చేస్తే కిలో ఉపాకాయలు రెండ్రూపాయలకు ఇప్పించే హామీ ఇచ్చెయ్యగ్రలు.

అమావాస్యలో వెలుగు దీపావళైతే మన జీవితాలు బ్లాక్ అండ్ వైట్ సినిమాలు. దట్సాల్!

## సర్పాదేవి

'ఖిస్సు బుస్సు' మనిపించే కలం వెలిగక్కుతుంది ఆర్య అనార్య సంఘర్షగా హాలాహలం. వీరు భూలోకంలో నాగలోకపు రెప్రజెంటేటివ్.

చతుర్దశినాడు ఆర్యఅనార్య సమరం ఆరంభమయింది. నరకాసురుడు అప్పుడే కుబుసం విడిచిన సర్పంలా మహోత్సాహంతో యుద్ధానికి

## -కె. హైమాభార్గవ్

సమాయత్తమయినాడు. గరుత్మంతుడి మీద వచ్చిన శ్రీ కృష్ణుడు కృష్ణ సర్పంలా ఫూత్కారం చేశాడు. అందరూ అచేతనులయి చూస్తూ వుండిపోయినారు. నరకాసురుడు శరీరాన్ని బిగించాడు. కండరాలను ఇనుపముద్దల్లా పొంగించాడు. భుజస్ఫాలనం చేశాడు. పౌరుష పరాక్రమాలు పిక్కటిల్లేలాగ పెద్దగా పొలికేకవేశాడు. కృష్ణుని సరసన నిలబడిన సత్యభామ కాటందుకో వచ్చిన కోడెనాగులా ఖస్సుమంది. కంచి పోంబట్టు ఎర్ర చీర కాసె బిగించి కట్టుకుందామె. చిలకపచ్చ కంచుకం తొడిగింది. తలకు చంద్రకావి రుమాలు చుట్టుకుంది. హేమంత బిరుదులు ధరించింది.

"అరే! దస్యుడా! నిన్ను యుద్ధానికి పిలుస్తోంది సత్యభామ. రావోయ్! రా! ఇటు!"అని ఎలుగెత్తి అరిచింది సత్యభామ.

## మ్యూజింగ్స్

మెకానికల్‌గా బతికే మనుషులను చూచి మెలాంకొలీతో మనస్సు మూలిగితే వచ్చిన మ్యూజింగులు వలంవెలిగించిన ఆరనిజ్యోతులు.

"ఈసారి దీపావళి చాలా బాగా జరిగిందోయ్.''

''బాగా జరగడం అంటే?''

''అదే. మంచి బట్టలు కొన్నాం. మా ఆవిడ స్వీట్లు చాలా బాగ చేసింది. క్రేకర్స్ వంద రూపాయిలకు కొన్నాం.''

ఏదో పండగలు సెలిబ్రేట్ చేసుకోవడం తప్ప Artistic గా జీవించడం అంటే ఏమిటో చాలా మందికి తెలియదు. ఎంత కాస్ట్లీ చీర కొంటే అంత గొప్ప. ఎన్ని క్రేకర్స్ కాలిస్తే అంత గొప్ప. దీపావళిని సెలిబ్రేట్ చేసుకుంటారు. వ్యాసాలు, పద్యాలు రాస్తారు. అంతే. అజ్ఞానంలో నుంచి బయటపడరు. వీళ్ళకు కావలసింది బయటి వెలుగే. లోపలి వెలుగు కాదు.

## గిరీశం ది గ్రేట్

లెక్చర్లు ఇవ్వడానికి అలవాటైన గిరీశం తన సహజ ధోరణిలో ఇలా అంటాడు.

వదినా! క్రేకర్స్ కాల్చడం అంటే సిగార్స్ కాల్చడం కాదు. ఇటీజ్ హైలీ డేంజరస్. ఫెస్టివల్స్ అండ్ ది వేస్టేజ్ మీద ఓ ఘంట లెక్చరిచ్చేద్దునుగాని మన టెయిగూసికి కొన్ని ఫార్మాలిటీస్ అఘోరించాయి కదా! పోతేవదినా! ఈ లైట్స్‌లో మీరు చాల బ్యూటిఫుల్‌గా వున్నారు. నా కెమెరా వుంటే ఒహ ఫోటో లాగించేద్దును. ఫోటో అంటే ఏమిటి? అదే పొటిగరాపు. మీ ఫోటో లాగించి, ఫారిన్ మేగజైన్‌లో పబ్లిష్ చేయిస్తే, ఆ ఫేసూ, అదీ దొరలు విగ్రహాలు కట్టించుకుని వర్షిప్ చేస్తారు.

పిండి రుబ్బేందుకు వెళ్తున్నారా? మీలాంటి యంగ్ బ్యూటీఫుల్ విడోని పిండి రుబ్బమనడం బార్బేరిజం. డామిట్! పెద్ద చిక్కొచ్చిపడింది. దొరల ఫాయలాలో ఇద్దరం రుబ్బి టెన్ మినిట్స్‌లో లాగించేద్దాం.

## ధర్మ సందేహా(శా)లు

సందేహాలను ధర్మ సూక్ష్మంతో సమాధానపరుస్తూ, ఇతిహాసాలను పరిహాసాల పాలు చేయకూడదన్న 'దీక్షా' కంకణం కట్టుకున్న

'విజ్ఞాన సూర్యప్రకాశులు' చెప్పేది చిత్తగించండి.

కె. శంకయ్య, అనంతపురం

గురువుగారూ! సత్యభామ నిజంగా నరకాసురుడితో యుద్ధం చేసిందంటారా?

జవాబు: చూడండి శంకయ్యగారూ! సత్యభామ నరకాసురుడితో యుద్ధం చేసిందని పోతనగారే చెప్పారు. అణు యుగంలో పుట్టిన మనం ఆడవాళ్ల శక్తి సామర్థ్యాలు శంకిస్తున్నామండీ. కానీ పోతనగారు శంకించలేదు. ఎవరు ఎవరితో యుద్ధం చేసినా దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ ముఖ్యమండీ. అదే మన పురాణాలు, ఇతిహాసాలు బోధించేది.

## యువజ్యోతి

చిన్న వయసులోనే మరిగిపోయిన యువజ్యోతి ఎమ్వీయల్ పాఠకుల ప్రశ్నలకు కొంటెగా, గడుసుగా, సరదాగా సమాధానాలిచ్చి అభిమానుల హృదయాలలో చిరంజీవిగా మిగిలారు. వారి సమాధానాలు ఇలా వుంటాయి.

అర వింద, ఆత్మకూరు

ప్రశ్న: మహా విష్ణువు దశావతారాలు ఎత్తడం ఎంత వరకు నిజం? నరకాసురుడు నిజంగా భూమి పుత్రుడా?

జవాబు: 'అరవింద' దళాయతాక్షుడు 'పరమాత్ముడు' రాష్ట్రాన్ని పాలించే 'నటసార్వభౌముడు' సినిమా రంగంలో ఎన్నో వేషాలు వేసి, జీవిత రంగంలో క్షణానికో ఫాన్సీ డ్రెస్ వేయగలిగినప్పుడు, లోకాన్ని పాలించే జగన్నాటక సూత్రధారి యుగానికో వేషం వేయడం సత్యదూరం కాదు. వేషము మార్చెను— ఐనా మనిషి మారలేదు అన్న 'అన్నగారి' పాట గుర్తుకు తెచ్చుకోండి.

భూమిన పుట్టిన నరకుడు 'భూమి పుత్రుడే'. మన మ ట్టూ కోరల్లేని రాక్షసులు చాలా మంది వున్నారు. 'రాక్షస సంహారం' కథల్లో తప్ప నిజంగా జరగడం లేదు.

## మండే సూర్యుడు

ఇంటిపేరు కారానికి పెట్టింది పేరయినా ఆయన కవిత్వం మాధుర్యానికి మరో పేరు. సాహితీ ఆకాశంలో మండే సూర్యుడు శేషేంద్రుడు ఇలా రాస్తారు. (సరదాకు)



## చివరి స్టాపు

నాముందొక ఆటంబాంబు పెట్టు
దాని ముందొక చిచ్చుబుడ్డీ పెట్టు
నా చేతిలో వెలుగులు చిమ్మే
కాకరొత్తి పెట్టు
వెలిగించమని నన్ను
ముందుకు నెట్టు.
అంతే.........
నా రక్తపోటు
రాకెట్‌లా ఎగిసి
గుండెను తాకి
అక్కడ
తన చివరి స్టాపును కలుస్తుంది.

## ఆరుద్ర

'కూనలమ్మ పదాలు' చదవని వారు అరుదనే చెప్పాలి. వాటిలో ఆరుద్రగారు అన్ని విషయాలపైన చెణుకులు విసిరారు. హాస్యం, వ్యంగ్యం, వాడి అన్నికనిపిస్తాయి. అంత్యప్రాసలు వారి కవిత్వానికి అదనపు అలంకారాలు. దీపావళి గురించి రాయమంటే వారు ఇలా రాస్తారు.

కొత్త అల్లుడొచ్చె
కోరికల లిస్టిచ్చె
మామగారు చచ్చె
ఓ కూనలమ్మ!

అమ్మగారి మాట
వెయ్యి బాంబుల మూట
పండగే ప్రతిపూట
ఓ కూనలమ్మ!

